ప్రజాశక్తి
శనివారం 25 జనవరి 2025 5 అనంతపురం

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం కాన్ఫరెన్స్ హాల్లో 54వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసేలా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను ఇవ్వాలన్నారు. పరిశ్రమల ఏర్పాటులో భాగంగా కేంద్ర, రాష్ట్ర పథకాలకు సంబంధించి రుణాల మంజూరును వేగవంతం చేస్తూ నూతన పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎపిఐఐసి జెడ్ఎంని ఆదేశించారు. జిల్లాలో 2020- 23, 2023-27 పాలసీలో ఐదు యూనిట్లకు రూ.14.73 లక్షల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా పరిశ్రమల అధికారి జిఎం.శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, కమర్షియల్ టాక్సెస్ డిప్యూటీ కమిషనర్ మురళి మనోహర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, ఎల్డిఎం నర్సింగరావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాసుల కోసం కార్పొరేట్ కళాశాలలు వెంపర్లాడుతున్నాయి. తమ కళాశాలలో చేర్చాలంటూ పరీక్షలు కూడా పూర్తవకనే యాజమాన్యాలు ఫోన్లు చేసి తల్లిదండ్రుల వెంటపడుతున్నారు. ముందస్తుగా అడ్వాన్స్ చేసి సీటు రిజర్వు చేసుకోవాలని కోరుతున్నారు. ఆలస్యమయితే సీటు దొరకదు.. ఒకవేళ దొరికినా అప్పుడు ఫీజు ఎక్కువగా ఉంటుందంటూ తల్లిదండ్రులను భయపెట్టే విధంగా చెబుతూ వారి విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునే ప్రయత్నాన్ని ఇష్టారీతిన చేస్తున్నారు.

కార్పొరేట్ కాసులవేట..!

- పదవ తరగతి పూర్తవకనే చేర్చాలని ఫోన్లు
- చేరాక తల్లిదండ్రులకు చుక్కలు
- బోధన కంటే ఫీజులపైనే దృష్టి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తమ కళాశాలలో చదివితే మంచి విద్య వస్తుందంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆయా కళాశాలల సిబ్బంది వెంపర్లాడుతున్నారు. కళాశాలల్లో విద్యార్థులు చేర్చే విషయంలో సిబ్బందికి ప్రత్యేకమై కోటాలున్నాయి. దీంతో ఇప్పటికే పదవ తరగతి చదువుతున్న వారి వివరాలు, మొబైల్ ఫోను నంబర్లు సేకరించారు. ఇక ఆలస్యం చేయకుండా పిల్లాడిని తమ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు కోరుతున్నారు. ఆలస్యం చేస్తే సీట్లు దొరకవు కాబట్టి ముందుగా కొంత మొత్తాన్ని చెల్లించి రిజర్వు చేసుకోవాలని చెబుతున్నారు. ఇంకా పిల్లాడు పదవ తరగతి పరీక్ష కూడా రాయలేదు. ఏ విభాగంలో చేరాలన్నది కూడా తల్లిదండ్రులు, పిల్లలు నిర్ధారించుకోలేదు. కార్పొరేట్ కళాశాలలు మాత్రం అప్పుడే విద్యార్థులను చేర్చుకునేందుకు వెంపర్లాడుతున్నారు. ఒక్కసారి చేరాక ఆ తరువాత ఫీజుల చుక్కలు కనబడుతున్నాయి. సాధారణ కళాశాలల్లో చేరితే తమ పిల్లలకు చదువు వస్తుందో రాదో... ఎంసెట్ సీట్ ఏమోనన్న భయంతో వేలకు వేలు కట్టేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. ఇలా కార్పొరేట్ కళాశాలల్లో చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు క్టకపోతే వేధింపులు తప్పడం లేదు. ఈ వేధింపులతో ఏటా విద్యార్థులు బలవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఆ కళాశాలలపై చర్యలకు వెనుకాడుతున్నారు. ఫిర్యాదలందినా చూసి చూడనట్టుగానే ఉంటుండటం గమనార్హం.

ప్రభుత్వం నియంత్రించాలి

ప్రభుత్వ ఆదేశాలిచ్చే వరకు అడ్మిషన్లు జరగడానికి వీల్లేదు. కాని కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి విద్యా సంవత్సరం ప్రారంభం కాకనే అడ్మిషన్లు అని ముందస్తుగా అడ్వాన్సులు వసూలు చేస్తున్నాయి. ఈ అంశాలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలుండం లేదు. ఫీజుల విషయంలోనూ వేధింపులకు పాల్పడకూడదని ప్రభుత్వం చెబుతున్నా కళాశాలలు విద్యార్థులను వేదిస్తున్నాయి. ఈ వేధింపులతోనే నారాయణ కళాశాలలో చైతన్య అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అయినా అధికారులు ఈ విషయంలో కళాశాలపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. సాధారణమైన అంశంగానే పరిగణిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి.

పరమేష్ , ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

26వ తేదీ జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. ఈ నెల 26వ తేదీన నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఎస్పీ జగదీష్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మాక్ డ్రిల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. జెసి మాట్లాడుతూ వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వేడుకల సందర్భంగా ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎ.మాలోల, ఆర్డీవో కేశవ నాయుడు, డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు గ్రీన్‌సిగ్నల్ : విప్

ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడుతున్న విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో వ్యవసాయ విద్యుత్ కొత్త సర్వీసుల మంజూరుకు ట్రాన్స్‌కో పచ్చజెండా ఊపిందని, ఫిబ్రవరి ఆఖరిలోపు కొత్త సర్వీసుల మంజూరుకు ట్రాన్స్‌కో సిఎండి సంతోష్ హామీ ఇచ్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శుక్రవారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో 2023 నుంచి 2,410 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకై దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని, ఆ దరఖాస్తుదారుల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాన్సఫార్మర్స్, విద్యుత్ పోల్స్, తీగల కొరతతో కొత్త వాటికి అనుమతులు ఆలస్యం అవుతున్నాయని అధికారులు తెలిపారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఈఈ శేషాద్రిశేఖర్, ఎడిఈ శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

ఫీజుల వేధింపులు దుర్మార్గం

- తరగతి బయట నిల్చోబెట్టడంతోనే విద్యార్థి ఆత్మహత్య
- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
- స్పందించకుంటే ప్రత్యక్ష ఆందోళనలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాంభూపాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పాఠాలు చెప్పాల్సిన విద్యాలయాల్లో ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేసి విద్యార్థుల ప్రాణాలను తీసేలా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమైన చర్యని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. గురువారం నాడు అనంతపురం నారాయణ కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబ సభ్యులను ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లిలో విద్యార్థి చరణ్ తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ చరణ్ తండ్రి వెంకటనారాయణ ఆవులు మేపుకుంటూ తన ఇద్దరు కుమారులను చదివిస్తున్నారని తెలిపారు. కుమారులను ఉన్నత స్థానంలో చూడాలని భావించిన ఆయనకు కార్పొరేట్ కళాశాల ఫీజులుం తీవ్ర శోకాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించలేదన్న కారణంతో విద్యార్థి చరణ్‌ను గంటల తరబడి తరగతి బయట నిలబెట్టడంతో యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విషాధకరమైన ఘటన అన్నారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ నిమిత్తం వెంకటనారాయణకు రూ.28 లక్షలకు పైగా అప్పులు ఉన్నాయన్నారు. ఇప్పుడు కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబం మరింత వేదనలో కూరుకుపోయిందన్నారు. అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులకు ఫీజుల పేరుతో తీవ్ర దృఃఖం మిగిలుస్తున్న కార్పొరేట్ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురం నారాయణ కళాశాలకు కనీసం రక్షణ ఏర్పాట్లు ఉన్నాయా అని పరిశీలించకుండా అనుమతి ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు, మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను రెసిడెన్సియల్ కళాశాలలుగా ఏర్పాటు చేసి కార్పొరేట్ వ్యాపారాన్ని అడ్డుకోవాలన్నారు. ప్రయివేటు కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థి చరణ్ కుటుంబాన్ని ఆదుకునే విషయంలో ప్రభుత్వం స్పందించక పోతే రాజకీయపార్టీలు, విద్యార్థి సంఘాలను కలుపుకుని ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓతూరు పరమేష్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షులు దామోదర్, ఎస్కె యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, మోహన్‌లు పాల్గొన్నారు.

రీ సర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని గుండిగానిపల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు చేపట్టిన రీ సర్వే పనులను శుక్రవారం తహశీల్దార్ సుమతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గుండిగానిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో రెండు బృందాలు సర్వే చేపట్టారన్నారు. ఇప్పటివరకూ 150 మంది రైతులకు గానూ 22 సర్వే నెంబర్లలో 160 ఎకరాల భూముల్లో రీ సర్వే పూర్తయిదన్నారు. అవకతవకలు జరగకుండా రైతులు రీ సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. త్వరితగతిన రీసర్వే పనులను పూర్తి చేయాలని బృందాలకు ఆమె సూచించారు. రీ సర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో ఆంజనేయులు, సర్వే టీం సభ్యులు, రైతులు ఉన్నారు.

డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి : ఆర్టీవో

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలు నడపాలని ఆర్టీవో రమేష్ సూచించారు. పట్టణంలో శుక్రవారం డ్రైవర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీవో కార్యాలయం వద్ద పట్టణంలోని డ్రైవర్లను సన్మానించి భద్రతపై సలహాలు, సూచనలు ఇచ్చారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు పొందాలన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. రోడ్ టాక్స్‌ను అప్‌డేట్ చేసుకోవడంతో అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు.

నర్సరీల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మొక్కల సాగుపై గ్రామీణ యువత అవగాహన పెంచుకోవాలని కెవికె కోఆర్డినేటర్ చిన్న రాయుడు సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు యుగంధర్, హర్షిని, శిరీషతో కలిసి నర్సరీల్లో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. నాణ్యమైన మొక్కలు పెంచటంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు, నేల సారవంతం, ఎరువులు, తెగుళ్లకు నివారణ మందుల వాడకం గురించి వివరించారు. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తే నేల సారవంతంగా మారడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని గుర్తు చేశారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం, జబ్బు వచ్చిన వెంటనే సకాలంలో సరైన వైద్యులచే చికిత్స తీసుకోవడం ప్రతి వ్యక్తి పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు అని పట్టణ వైద్యాధికారి డా.యశ్వంత్, ఆరోగ్యవిద్యా బోధకులు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. 'స్వచ్ఛ రాయదుర్గం-స్వస్థ రాయదుర్గం'లో భాగంగా శుక్రవారం పట్టణంలోని 9వ సచివాలయం, డ్రైవర్స్ కాలనీలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు, బాలికా సంరక్షణ, ఫ్రైడే డ్రైడే ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, శానిటేషన్ సెక్రటరీ నరేష్, హెల్త్ సెక్రటరీలు సరోజ, ఈశ్వరమ్మ, ప్రమీల, ఆశా కార్యకర్తలు సుశీల, అంజనమ్మ, యశోద, జ్యోతి, పద్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు..?

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రజా సమస్యలు పరిష్కరించని సర్వసభ్య సమా వేశాలు నిర్వహించడం అవసరమా అని అధికా రుల తీరుపై ప్రజాప్రతి నిధులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి కమలమ్మ నాగరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ 3 నెలల క్రితం నిర్వహించిన సమావేశంలో విన్నవించిన సమస్యల్లో ఏ ఒక్కటైనా పరిష్కరించారా అని అధికారులను నిలదీశారు. అధికారులు చుట్టపుచూపుగా కార్యాలయానికి వస్తున్నారే కానీ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని మండపడ్డారు. శ్మశానవాటిక సమస్యను ప్రతి సమావేశంలో లేవనెత్తినా ఫలితం లేదని ఎంపిటిసి ఈరన్న తెలిపారు. సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం తగదని ఎంపిడిఒ లక్ష్మీశంకర్ తెలి పారు. సమావేశాలకు కిందిస్థాయి సిబ్బందిని పంపించడం మానుకోవాలని మండల స్థాయి అధికారు లకు సూచించారు. తూతూ మంత్రంగా నిర్వహించే సమావేశాలకు మేమెందుకు రావాలని కొందరు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. సమావేశంలో జడ్పిటిసి రాధాస్వామి, తహశీల్దార్ శ్రీనివా సులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పరిటాల ఆశయాలను కొనసాగిస్తాం

వర్ధంతి సభలో కుటుంబ సభ్యులు - వెంకటాపురంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభిమానుల నివాళి

పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు

ప్రజాశక్తి-చెన్నెకొత్తపల్లి

పరిటాల రవీంద్ర ఆశయాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు. మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరిటాల రవి 20వ వర్ధంతి కార్యక్రమాన్ని అభిమానుల మధ్య వెంకటాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. రవి సతీమణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కుమారుడు పరిటాల శ్రీరామ్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. వీరితో పాటు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యేలు విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్.రాజు, పల్లె సింధూరరెడ్డి, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హనుమంతరాయచౌదరి, ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజనప్ప తదితరులు నివాళి అర్పించారు. ఉమ్మడి అనంతతో పాటు పావగడ ప్రాంతం నుంచి వచ్చిన పరిటాల అభిమానులతో వెంకటాపురం జనసంద్రంగా మారింది. రవి ఘాట్ వద్ద నివాళులు అర్పించిన సమయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఉద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతి వర్ధంతి రోజునా వెంకటాపురం తరలొచ్చే అభిమానులను చూస్తుంటే ప్రజల గుండెల్లో రవి ఎంత బలంగా ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఆయన మరణించి 20 ఏళ్లైనా ఇప్పటికీ అభిమానులు గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారన్నారు. త్వరలో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వందేళ్ల తర్వాత కూడా పరిటాల రవి పేరును చెప్పుకునేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు రవితో వారికున్న అనుబంధాన్ని నెమరవేసుకున్నారు. పెనుకొండలో పరిటాల రవి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత తెలిపారు. వర్ధంతి సందర్భంగా వెంకటాపురంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో నియోజకవర్గంలోని రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. రాజకీయ పార్టీలకు అతీతంగా సీనియారిటీ ప్రకారం రైతులకు పంపిణీ చేయాలనీ ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఫోన్‌కు మెసేజ్ వచ్చిన వారు శనివారం ఉదయం 10 గంటలకు విద్యుత్ శాఖ అధికారులను కలిసి ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఓ ప్రకటనలో తెలిపారు.

రామస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల

పట్టణంలోని కోటవీధిలో వెలసిన శ్రీపట్టాభిరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన క్యాంపు కార్యాలయం ప్రజావేదికలో విడుదల చేశారు. శ్రీరామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

సిఎం దృష్టికి సచివాలయ ఉద్యోగుల సమస్యలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో పని చేస్తున్న 1,27,000 మంది సచివాలయ ఉద్యోగుల సమస్యలను బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలి పారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను రద్దు చేసి రేషనలైజేషన్ విధానాన్ని అమలు చేయడం వల్ల సచివాలయ ఉద్యోగులపై పని భారం పడిందన్నారు. తదావరా సంక్షేమ పథకాల అమలుకు ఆటంకాలు కలిగే ప్రమాదం ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులైనా వారికి ఆ హక్కులు, అవకాశాలు, ప్రయోజనాలు అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వారి న్యాయమైన కోర్కెలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, జాబ్ చార్టు అమలు చేయాలన్నారు. లేనిచో వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ రూపంలో సమాధానం చెబుతామ న్నారు. త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు తెలిపారు.

రంగులు వేయకుండానే బిల్లులు ..!

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని గోవిందవాడ గ్రామంలో 2023లో అంగన్వాడీ భవనం నిర్మించారు. దానికి ఇప్పటి వరకూ రంగులు వేయకపోయినా అప్పటి అధికారులు బిల్లులు మంజూరు చేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటీవలే మరుగుదొడ్డి నిర్మించారు. దానికి కూడా రంగులు వేయకపోయినా నిధులు మంజూరు చేశారన్న విమర్శలు ఉన్నాయ. ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ అధికారి జగదీష్‌ను, మరుగుదొడ్డి విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ జెఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తమ పరిధిలో లేని అంశమని సమాధానం దాట వేశారు.

అద్దెకు ఆర్టీసీ గదులు, ఖాళీ స్థలాలు

రాయదుర్గం : స్థానిక ఆర్టీసీ బస్టాండ్, కణేకల్లులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఖాళీగా ఉన్న గదులు, ఖాళీ స్థలాలను అద్దెకు ఇవ్వడానికై టెండర్లు పిలిచినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు టెండరు పత్రాలను స్థానిక డిపో మేనేజర్ కార్యాలయంలో పొంది ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు అనంతపురంలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో సీలు వేసిన టెండర్ బాక్స్‌లో టెండరు పత్రాలను వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ బాక్స్ తెరిచి టెండర్‌ను ఖరారు చేస్తారన్నారు.

గవి సిద్ధేశ్వర స్టీల్ ప్లాంట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని రాయంపల్లి సమీపంలో ఉన్న గవి సిద్ధేశ్వర స్టీల్ ప్లాంట్ ఎదుట శుక్రవారం అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్), సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ మాట్లాడుతూ గుమ్మఘట్ట మండలంలోని భూపసముద్రం గ్రామానికి చెందిన బోయ నాగరాజు ఈ స్టీల్ ప్లాంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ 5 నెలల క్రితం మృతి చెందాడు. ఆర్థిక సాయం విషయంలో మేనేజర్ పొంతనలేని సమాధానాలు చెప్పడం సరికాదన్నారు. ఆర్థిక సాయం విషయంపై మూడు రోజులు గడవు ఇవ్వాలని మేనేజర్ కోరగా ధర్నా విరమించారు.

డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాయదుర్గం

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సేవ్ విజన్ కంటి వైద్యశాలలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ మురళి మోహన్ ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంవిఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వాహనదారులు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవటం తప్పనిసరి అన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ లేకుండా, మత్తు పదార్థాలు, మద్యం తాగి వాహనం నడపరాదన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్, కార్లు మరియు ఇతర వాహనదారులు సీట్ బెల్టు ధరించాలన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

మాట్లాడుతున్న సిడిపిఒ లక్ష్మిప్రసన్న

ప్రజాశక్తి-కణేకల్లు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సిడిపిఒ లక్ష్మీప్రసన్న సూచించారు. స్థానిక కెజిబివిలో శుక్రవారం ఎస్ఒ మంజుల ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం నిర్వహించగా సిడిపిఒ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికల సాధికారిత, సమానత్వం సాధన దిశగా జరిగే కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విద్య, ఆరోగ్య రంగాల్లో బాలికలు చురుగ్గా ఉండాలన్నారు. బాలికలు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రమాదేవి, గీత, శాంతకుమారి, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

దాబా కూల్చివేతకు పాల్పడుతున్న వారిని అడ్డుకుంటున్న దృశ్యం

పొలాలకు వెళ్లే దారి మూసివేతపై రైతుల ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న శ్రీ సాయి డిగ్రీ కళాశాల సమీపంలో తమ పొలాలు, ప్లాట్లకు వెళ్లే దారిని కొందరు మూసివేయడంతో రైతులు, ప్లాట్ల యజమానులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. గుత్తి నుంచి ఎస్ఎస్.పల్లి వరకూ ఉండే పొలాలు, ప్లాట్లకు గతంలో రస్తా ఉండేదని దాన్ని కొందరు కబ్జా చేసి కంచె వేసి అందులో దాబా నిర్మిస్తుండటంతో రైతులు, ప్లాట్ల యజమానులు జెసిబితో అక్కడికి వెళ్లి దాబాను కూల్చివేతకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కె.సురేష్, సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి రైతులు, ప్లాట్ల యజమానులు, దాబా నిర్వాహకులతో చర్చించారు. రస్తాను కొనసాగించేందుకు వారంరోజులు గడువు ఇవ్వాలని దాబా నిర్వాహకులు చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ప్లాట్ల యజమానులు ప్రసాద్, నాగయ్య, గోవిందు, పెద్దయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే నిజమైన నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతుగా, న్యాయవాదిగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడుగా, గుత్తి సమితి ప్రెసిడెంట్‌గా, కమ్యూనిస్టు నేతగా బహురంగాల్లో రాణించిన కామ్రేడ్ జెడ్ వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. జెడ్ వీరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఉన్న గణేనాయక్ భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దవడుగూరు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించిన జెడ్ వీరారెడ్డి విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలవైపు ఆకర్షితుడై కమ్యూనిస్టు నేతగా మారారన్నారు. గుత్తి సమితికి జరిగిన ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారన్నారు. ముఖ్యంగా గుత్తి రైల్వేకేంద్రంగా ఉండటంతో కార్మికులను కేంద్రీకరించి పని చేయడం కోసం కృషి చేశారన్నారు. తన 67వఏళ్లలో కూడా జిల్లాలో పట్టు రైతులను సమీకరించేనందుకు హిందూపురం ప్రాంతానికి వెళ్లి అక్కడ జరిగిన పోలీసు లాఠీఛార్జీలో తీవ్రంగా గాయపడ్డారన్నారు. అలాంటి ఆయన ఆశయాలను అమలు చేయడం నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.రామిరెడ్డి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌వి.నాయుడు, ముత్తుజా, వై.వెంకటనారాయణ, ఇర్ఫాన్, ఓబులేసు, రాజు, ప్రకాష్‌రెడ్డి, ఎర్రిస్వామి, గఫూర్, బాలకృష్ణ, ఆదినారాయణ, పోతులయ్య, షంషాద్, లాలెమ్మ, మాబ్బీ, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

పెద్దవడుగూరు : రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా రైతు, కార్మిక ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి సాధించిన కామ్రేడ్ జెడ్ వీరారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్.వీరారెడ్డి పెద్దవడుగూరులో ధనిక రైతు కుటుంబంలో జన్మించినా విద్యార్థి దశలోని అభ్యుదయ భావాల వైపు ఆకర్షితులయ్యారన్నారు. తర్వాత కమ్యూనిస్టు నాయకుడిగా మారి రైతులు, కార్మికులు ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. చనిపోయేంత వరకూ ప్రజల కోసమే పని చేశారన్నారు. అంతేగాకుండా గుత్తి సమితి ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిగా విజయం సాధించారన్నారన్నారు. అలాంటి ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సహాయ కార్యదర్శి మదిలేటి, రైతుసంఘం మండల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, తిరుపాలు, బొజ్జన్న, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరులోని జెడ్.వీరారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు



గణేనాయక్‌భవన్‌లో జెడ్.వీరారెడ్డికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుత్తి : దివంగత సిపిఎం నాయకులు జెడ్.వీరారెడ్డి ఆశయాలను సాధిద్దామని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వీరారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెడ్.వీరారెడ్డి ధనిక రైతు కుటుంబంలో పుట్టినప్పటికీ పేద ప్రజల పక్షాన నిలిచారని చెప్పారు. సమితి అధ్యక్షులుగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, మంచినీటి సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేశారన్నారు. జెడ్.వీరారెడ్డిని ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కవిత, రేవతి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, సిఐటియు నాయకుడు పోతులూరు, తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా మారాలి

జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

శిక్షణలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

జడ్పి కార్యాలయ సిబ్బంది రోజువారి విధుల్లో భాగంగా టెక్నాలజీకి అనుగుణంగా మారు చెందుతూ ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న డిపిఆర్‌సి భవనంలో ఈ-ఆఫీస్‌పై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ప్రతి ఉద్యోగి రోజువారి కార్యాలయ విధుల్లో అప్డేట్ అవ్వాలన్నారు. ఈ-ఆఫీస్ ద్వారా త్వరితగతిన పారదర్శక సేవలు అందించవచ్చన్నారు. ఈ-ఆఫీస్ ప్రతి కార్యాలయంలో అమలు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ-ఆఫీస్ వల్ల పారదర్శక సేవలు అందించవచ్చని చెప్పారు. అంతేకాకుండా, ప్రతి ఫైలు సురక్షితంగా ఉంటూ నిర్దిష్ట సమయంలో ఫైల్స్ క్లియర్ చేయడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్య కార్య నిర్వహణ అధికారి వెంకటసుబ్బయ్య, ఉభయ జిల్లాల మండల అభివృద్ధి అధికారులు, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్దాం..

జెడ్.వీరారెడ్డి, ఆంజనేయులు వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

పజాశక్తి-గుంతకల్లు

జెడ్.వీరారెడ్డి, ఆంజనేయులకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఉద్యమ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు చేయడమే కామ్రేడ్‌లకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సీనియర్ నాయకులు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ అన్నారు. దివంగత కామ్రేడ్ జెడ్ వీరారెడ్డి, ఆంజనేయులు వర్ధంతులను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత జెడ్.వీరారెడ్డి రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడుగా, సమితి అధ్యక్షులుగా, కమ్యూనిస్టునేతగా బహురంగాల్లో రాణించిన అరుదైన వ్యక్తి అన్నారు. ధనిక రైతు కుటుంబంలో జన్మించినా విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాల వైపు ఆకర్షితులయ్యారన్నారు. అభ్యుదయ భావాలు ఆకర్షితుడై పేద ప్రజల కోసం పోరాటాలు చేస్తూ ఆనాడు జాతీయోద్యమ ప్రభావం బలంగా ఉన్న సమయంలో ప్రజలతో కలిసి పోరాటాలు చేశారన్నారు. అలాగే గుత్తి సమితికి జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారన్నారు. ప్రజాప్రతినిధిగా తన పదవీ కాలంలో తాలుకా లో విస్తతంగా పర్యటించి గ్రామాలకు మంచినీరు, పాఠశాలలు, విద్యుత్, రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పనకు ఎనలేని కృషి చేశారన్నారు. కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న ఆయన తన భార్య ఆదిలక్ష్మిని డాక్టర్ చదువు చదవించారన్నారు. ఆదేవిధంగా కామ్రేడ్ ఆంజనేయులు పట్టణంలో పారిశుధ్య కార్మికులు, రైల్వే కార్మికులు అనేక సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, రంగమ్మ, సురేంద్రబాబు, కమిటీ సభ్యులు అబ్దుల్లా, షాషా, షబ్బీర్, జగదీష్, కె.నర్సయ్య, జాకీర్, ఓబులేసు, బాషా, తిమ్మప్ప, రాము, షాకీరా, ఖాదర్, డేనియల్, ఈరన్న, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుంది

ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

కార్యక్రమంలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా ప్రతిగింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మార్కెట్ యార్డులో ఎపి పిఎసి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందులు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు కష్టపడి పండించిన పంట మార్కెట్లకు తీసుకెళ్లిన తర్వాత తూకాల్లో మోసం, ధరల దోపిడీ, నాణ్యతను అడ్డుపెట్టుకుని దళారీ వ్యవస్థ మోసం చేస్తోందన్నారు. స్థానిక మార్కెట్‌లో 5 నుంచి 6వేల వరకూ మాత్రమే రైతులు పండించిన కందులను వ్యాపారులు కుంటున్నారన్నారు. ఆ విధంగా రైతు నష్టపోకుండా ఉండేందుకు కనీసం మద్దతు ధర రూ.7,550తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రవాణా సౌకర్యం ఇబ్బంది ఉన్న గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఇకపోతే రైతు సంక్షేమం కోసం వ్యవసాయ పరికరాలను సబ్సిడీతో ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాల్మీకి మాధవి, జడ్పిటిసి కదిరప్ప, దోనిముక్కల సర్పంచు శ్రీరాములు, తహశీల్దార్ రమాదేవి, ఎఒ విజయ్‌కుమార్, మార్క్‌ఫెడ్ డిఎం పెండేశ్వరి, టిడిపి నాయకులు బండారు ఆనంద్, పాలు మల్లికార్జున, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో శ్మశానవాటికల అభివృద్ధి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

సమాధులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం, మేయర్లు, అధికారులు

నగరంలోని నవోదయ కాలనీలో ఉన్న శ్మశానవాటికల్లో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. శుక్రవారం నగర పరిధిలోని నవోదయ కాలనీలో ఉన్న శ్మశానవాటికలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అన్ని శ్మశానవాటికల్లో లైట్ల ఏర్పాటుతోపాటు ముళ్లపొదల తొలగింపు పనులు చేపడుతున్నామన్నారు. సమాధుల మధ్యలో కూడా శుభ్రత చేపట్టాలని ఆదేశించామన్నారు. నవోదయ కాలనీ శ్మశాన వాటికలో మట్టి రోడ్ల స్థానంలో సిమెంట్ రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామాంజనేయులు, అబూసాలేహా, సైఫుల్లా బేగ్, ఎఇ సాయినాథ్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి తనిఖీ

రాప్తాడు : మండల కేంద్రంలోని పిహెచ్‌సిని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పూర్తి వివరాలను పిహెచ్‌సి డాక్టర్ శివకృష్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యాక్సిన్ భద్రపరిచే శీతల పెట్టె, ఉష్ణోగ్రత పుస్తకం, వ్యాక్సిన్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఫార్మాసిస్టు మూర్తికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అదేవిధంగా కాన్పులు చేసే గది, లాబ్‌గదిని పరిశీలించారు. అనంతరం హంపాపురం సచివాలయ ఇమ్యునేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ శివప్రసాద్, సూపర్‌వైజర్ నరసింహా, అరుణ, ఎంఎల్‌హెచ్‌పి చంద్రకళ, ఎఎన్ఎం పుష్పలత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

బాలికా దినోత్సవంలో డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలని డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో బాల బాలికలు ఇద్దరూ సమానమే అన్నారు. అమ్మలేని సమాజం అనాథ అవుతుందన్నారు. అమ్మ, చెల్లి, కూతురు, అక్క వంటివారు ప్రతి కుటుంబంలో ఉండాలని కోరుకుంటారన్నారు. అలాంటప్పుడు పుట్టుక సందర్భంలో ఆడ శిశువును వద్దనుకోవడం దురదృష్టకరమన్నారు. కావున లింగ వివక్ష మాని ఆడపిల్లలను బతకనివ్వడంతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రోత్సాహం ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె అధికారి నారాయణస్వామి, కొర్రపాడు వైద్యాధికారిణి ఇందిరా ప్రియదర్శిణి, జిల్లా డెమో అధికారి త్యాగరాజు, డిప్యూటీ డెమో గంగాధర్, హెచ్‌ఇ పర్వీన్, పాఠశాల ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ కేశవయ్య, ఆరోగ్య కార్యకర్త వెంకటేశులు ఎఎన్ఎంలు ఆదిలక్ష్మి, కవిత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : బాల్య వివాహాలు చేయకుండా బాలికలకు చదివిస్తే సమాజంలో మార్పు వస్తుందని ఐసిడిఎస్ పీడీ వనజా అక్కమ్మ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎపి బాలికల గురుకుల పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో.. మండలంలోని రజాపురం వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా సమాచారాన్ని 1098కు తెలపాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ విజయలత, డిసిపిఒ మంజునాథ్, పిఒఐసి వెంకటేశ్వరి, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి, ఓఆర్‌డబ్ల్యు కమలాక్షి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు నాగేశ్వరి, బేతాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ దేవేంద్రనాయక్, ప్రిన్సిపాల్ విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ వేణు, వెంకటేశ్వర్. తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెజిబివి పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్‌నాయక్, డాక్టర్ తేజస్విని బాలికలకు ఆరోగ్యం, శుభ్రత, భద్రత, బాల్య వివాహాలు, విద్య ప్రాముఖ్యత, కౌమార దశలో వచ్చే ఆరోగ్య సమస్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమ్మ, ఆరోగ్య కార్యకర్తలు మమత, తిరుపాలమ్మ, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజామణి ఆధ్వర్యంలో శుక్రవారం బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లను పుట్టనిద్దాం, బతకనిద్దాం అనే నినాదంతో ప్రజలందరికీ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాళ్లు, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : బాలికల విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో'పై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలిక తప్పనిసరిగా విద్యను అభ్యసించాలని తెలిపారు. బాలిక విద్యతోనే సమాజంలో మార్పు తీసుకురావడం సాధ్యమన్నారు. బాలికల విద్యను పెంపొందించడానికి తల్లిదండ్రుల సహకారం అవసరమన్నారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది మహాలక్ష్మి, గీత, కుమారి, విజయలక్ష్మి, పార్వతి, స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ ఉపాధ్యాయులు తహరున్, జ్ఞానేశ్వరి, కుమారి, కృష్ణవేణి, సుమాంజలి, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఐసిడిఎస్ తాడిపత్రి ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు, ఆడపిల్లల హక్కులు, స్త్రీ విద్య, ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అరుణ, పుష్పలత, సంజీవమ్మ, పెద్దక్క, జయశ్రీ, వాణి, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : తల్లిదండ్రులు ఆడపిల్లలపై వివక్ష చూపకుండా మగపిల్లలతో సమానంగా పెంచాలని డాక్టర్ దిలీప్‌కుమార్ సూచించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని మర్తాడు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా లింగ వివక్షపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఆరోగ్య విస్తారణాధికారి నాగేశ్వరయ్య, సూపర్‌వైజర్లు విశ్వనాథ్, గాయత్రి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు

ప్రజాశక్తి-యాడికి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే వ్యాధులను దూరం చేయవచ్చని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజు ఆధ్వర్యంలో డ్రై డే ఫ్రైడేపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి తొట్లలో నిల్వ ఉంచిన నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరికైనా జ్వరం వస్తేవెంటనే రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవరాజ్, ఎంపిహెచ్‌ఒ లక్ష్మన్న, పిహెచ్ ఎం సుమతి, సూపర్‌వైజర్ సరోజమ్మ, ఎంపిహెచ్‌ఎ మేల్ నారాయణస్వామి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

'ఉల్లాస్' వాచకాలు పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ శిక్షణ తరగతులు నిర్వహించి వాచకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య సూపర్‌వైజర్ ఉషారాణి, ఐసిడిఎస్ సిడిపిఒ భారతి, ఇఒఆర్‌డి శైలజారాణి, ఎపిఎం తిప్పమ్మ, సీసీలు రామకృష్ణ, పుల్లారెడ్డి, నాగరత్నమ్మ, నాగానందం, అకౌంటెంట్ కోటేశ్వరమ్మ, యానిమేటర్లు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం సిటీ : సచివాలయ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని రిజర్వేషన్ పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జూనియర్ అసిస్టెంట్ స్కేల్‌ను అమలు చేయాలని, ఖాళీగా ఉన్నఉద్యోగాలను భర్తీ చేయాలని, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు బాలరాజు, ఆర్‌ఇఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.నారాయణనాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాజారమేష్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎన్.రాఘవేంద్రరావు, సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు వరప్రసాద్, ఆర్‌పిఎస్ అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు శివరుద్రయ్యగౌడ్, వైఆర్.కృష్ణ, ఆర్‌ఇఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.మహేష్‌నాయక్, శివశంకర్, అనిల్‌కుమార్, రవికుమార్, మేదర చిరంజీవి, టి.నిస్సార్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై తక్షణ స్పందన

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

డిజిటల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించేందుకు తక్షణం ప్రొఫైల్ తయారు చేయాలని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ అధ్యక్షతన పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఇందులో తాడిపత్రి పురపాలక వార్డులకు సంబంధించిన నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వివిధ వార్డు మ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తెలియజేయాలన్నారు. ప్రతి వార్డులో ప్రొఫైల్ తయారు చేయాలని సూచించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ఎంవిఐ రాజాబాబు, సిఐ రామసుబ్బయ్య

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎంవిఐ రాజాబాబు, సిఐ రామసుబ్బయ్య సూచించారు. ఎస్పీ పి.జగదీష్ సిఐ, ఎంవిఐ, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో మండల పరిధిలోని కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద కళాబృందంతో హెల్మెట్ ధరింపుపై వాహన చోదకుల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నియంత్రించడంలో హెల్మెట్ ధరింపు కీలకమైందన్నారు. హెల్మెట్ ప్రాముఖ్యతను టూవీలర్ డ్రైవ్ చేసే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా ధరించాలని కోరారు. వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వలన ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

వికలాంగుల పింఛన్ల పున:పరిశీలన

గుంతకల్లు రూరల్ : సదరం సర్టిఫికెట్ల మంజూరులో జరిగిన అవకతవకలను గుర్తించేందుకు శుక్రవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ జయవర్ధన్‌రెడ్డి వికలాంగుల పెన్షనర్లను పున:పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులు ఆదేశాల మేరకు శుక్రవారం కంటి చూపునకు సంబంధించిన సదరం క్యాంపు సర్టిఫికెట్ ఆధారంగా పింఛన్ లబ్ధి పొందుతున్న లబ్ధిదారులను పరిశీలించినట్లు తెలిపారు. 200 మంది క్రౌడ్ ఎక్కువ కావడంతో నాలుగు గదులు ఏర్పాటు చేసి డాక్టర్ల పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంకాలం 6 గంటల వరకూ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. పరిశీలించిన వారి వివరాలను సదరం కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు.

ఒలింపియాడ్‌లో 'మాంటిస్సోరి'కి పతకాలు

అనంతపురం :

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి

యూనిఫైడ్ వారు జాతీయస్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో నగరంలోని సంఘమేష్ నగర్‌లో ఉన్న మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఎ.సన్నిధి ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణపతకం, ల్యాప్‌టాప్ సాధించింది. అలాగే 5వ తరగతి విద్యార్థులు ఎం.పృథ్వీరాజ్, జి.జ్ఞానేశ్వరి 7, 10వ ర్యాంకులు సాధించారు. 8వ తరగతి విద్యార్థి 5వ ర్యాంకు సాధించి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు దక్కించుకున్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, పాఠశాల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

'అనంత'ను కలిసిన వైసిపి యువజన విభాగం అధ్యక్షులు శ్రీనివాస్

అనంతపురం : వైసిపి యువజన నగర అధ్యక్షులుగా నియమితులైన శ్రీనివాస్ గురుదత్తా శుక్రవారం అనంతపురంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం పేరుతో యువతను మోసం చేసిందన్నారు. అంతేగాకుండా కూటమి నాయకులు చేస్తున్న అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

ఓటుహక్కుపై వ్యాసరచన పోటీలు

యాడికి : కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని వాగ్దేవి హైస్కూల్లో ఓటుహక్కు వినియోగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ హరినాథ్‌రెడ్డి, వాగ్దేవి హై స్కూల్ కరస్పాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాల తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని చిన్న మల్లేపల్లి రెవెన్యూ గ్రామంలో శుక్రవారం పప్పుశనగ పంటలో చేపట్టిన పంటకోత ప్రయోగాన్ని మండల వ్యవసాయ అధికారిణి కాత్యాయిని తనిఖీ చేశారు. అలాగే చిన్న మల్లేపల్లి రెవెన్యూ గ్రామంలో రైతు హేమలత పొలంలో సాగు చేసిన కంది పంటలో పంటకోత ప్రయోగం చేశారు. ఆయా కార్యక్రమాల్లో విహెచ్‌ఎ మనోరమ, బీమా ఏజెంట్ షమీర్ పాల్గొన్నారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

గార్లదిన్నె : ఫీజుల కోసం విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న నారాయణ కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి బండారు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సోమలదొడ్డి వద్ద ఉన్న నారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ కళాశాల యాజమాన్య వేధింపులు భరించలేక భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థి ఆత్మహత్యకు కళాశాల యాజమాన్యమే పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. వెంటనే కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, కుళ్లాయి స్వామి, నాగరాజు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

అనంతపురం : పేదల ఆకలి తీరుస్తున్న 'అన్న క్యాంటీన్'కు విడపనకల్లు మండలం పాల్తూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్తి వెంకటస్వామి శుక్రవారం అనంతపురంలో రూ.1116 విరాళంగా అందజేశారు. మంచి కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు విరాళం ఇచ్చిన వెంకటస్వామిని పలువురు టీచర్లు, సామాజిక కార్యకర్తలు అభినందించారు.

నేరాలు ఘోరాలు

బైక్ నుంచి కిందపడి మహిళ మృతి

బ్రహ్మసముద్రం : తల్లి, కుమారుడు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కళ్లు తిరిగి బైక్‌పై నుంచి కిందపడడంతో తల్లి మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలోని పిల్లలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కురుబ తిప్పక్క(55) తన కుమారుడు హనుమంతరాయుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై గుమ్మగట్ట నుంచి స్వగ్రామం వస్తుడగా నాగిరెడ్డిపల్లి గ్రామం వద్ద కళ్లు తిరిగి కింద పడింది. దీంతో ఆమె తల వెనుక భాగంలో తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు హనుమంతరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. కాగా పిల్లలపల్లి గ్రామానికి చెందిన కురుబ శివన్న, తిప్పక్క(55) దంపతులు గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. శివన్న క్యాన్సర్‌తో బాధ పడుతూ 3 నెలల క్రితం మృతిచెందాడు. వారికి హనుమంతరాయుడు, అనిల్, ఒక కుమార్తె సంతా నం. మూడు నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో ఆ ముగ్గురూ పిల్లలూ అనాథలయ్యారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అనాథలైన పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.